క్లుప్తంగా

నలందలో టెక్‌వన్ ఐటీ సర్వీసెస్ ప్రాంగణ ఎంపికలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): టెక్‌వన్ ఐటీ సర్వీసెస్ వారు బుధవారం నలంద డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ దశల్లో గ్రూప్ డిస్కషన్, రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి, 23 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం .అనురాధ తెలిపారు. ఎంపికైన వారికి ఆ సంస్థలో 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, రాష్ట్రంలోని ఏ బ్రాంచ్‌లోనైనా ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి చంద్రగిరి, కమ్యూనికేషన్ స్కిల్స్ హెచ్‌ఓడీ బి.రజనీప్రదీప, టెక్నికల్ హెడ్ తిరుపతిరావు పర్యవేక్షించారు.

దుర్గగుడి డీఈకి విధులు కుదింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీఈకి విధులను ఈఓ భ్రమరాంబ కుదించినట్లు తెలుస్తుంది. అన్నవరం దేవస్థానం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన సత్యనారాయణ దుర్గగుడిలో ట్రాన్స్‌పోర్ట్, వాటర్ సెక్షన్, ఎలక్ట్రికల్ సెక్షన్‌లను పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల దేవస్థానం నూతనంగా రెండు బస్సులను తయారు చేయించాలని నిర్ణయించింది. రెండు ఛాసిస్‌ల కొనుగోలు వ్యవహారంలో సత్యనారాయణపై పలు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ఈఓ భ్రమరాంబ కల్పించుకుని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడటంతో రూ.లక్షల్లో వ్యత్యాసం వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో డీజిల్ కొనుగోలు వ్యవహారంలో కొన్ని ఆరోపణలు రావడంతో సత్యనారాయణకు కేటాయించిన ట్రాన్స్‌పోర్ట్, వాటర్ సెక్షన్లను తొలగించి మరో డీఈకి అప్పగించినట్లు సమాచారం.

తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం పేరును పునరుద్ధరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరం నడిబొడ్డున ఉన్న తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం పేరును యథావిధిగా పునరుద్ధరించాలని కోరుతూ పలు సాహితీ, కళా సంస్థలు, సామాజిక ఉద్యమకారులు బుధవారం కళాక్షేత్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పీ చంద్రనాయక్ అధ్యక్షత వహించారు. జనసాహితి నాయకులు దివికుమార్, సామాజిక ఉద్యమకారులు టీ లక్ష్మీనారాయణ, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, రవితేజ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నం పెంచలయ్య, రాష్ట్ర కోశాధికారి పిచ్చయ్య, అప్పన్న, ఎస్‌కె నజీర్, లంక దుర్గారావు, భాస్కరరావు, సూరిబాబు, బాషా, జాషువా సాంస్కృతిక వేదిక నాయకులు గుండు నారాయణ, డీవీ రాజు, సుబ్బారెడ్డి, రంగం సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు ఆర్ రాజేష్, బొబ్బిళ్లపాటి సాయి, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు పరుచూరి అజయ్ పాల్గొన్నారు.

చురుగ్గా యూజీడీ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్ సమీపంలో యూజీడీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడ స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే యూజీడీ పైపులైన్ పనులు పూర్తికాగా పంపింగ్ స్టేషన్ పూర్తయితే డివిజన్ వాసులకు యూజీడీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవల ఇక్కడ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు యూజీడీ పనులు వేగవంతం చేయాలని, రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. దీంతో ఇక్కడ యూజీడీ పనులు వేగవంతం అయ్యాయి.

సేవాగుణం అలవర్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తోటివారికి సేవ చేయడం అలవాటుగా చేసుకోవాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ సూచించారు. దుర్గాపురానికి చెందిన ఫణి, వల్లి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జన్మదినం , వివాహ దినోత్సవం వంటి శుభకార్యాలకు అనవసరపు ఖర్చుచేయకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం మాతృ దేవో భవ ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు వడ్డించారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి పర్యవేక్షించారు.

గృహ ప్రవేశాలకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు నిర్దేశించిన 16వేల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల ప్రగతిపై బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, స్పెషలాఫీసర్లు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి సుమారు 16 వేలకు పైగా ఇళ్లకు లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 7,821కు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశలలో ఉందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి నిర్దేశిత సమయానికి గృహప్రవేశాలు చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులతో తక్షణమే ముఖాముఖి మాట్లాడి నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.

లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉగాది నాటికి లక్ష్యాలు పూర్తి కావాలన్నారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఈ రవికాంత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, జిల్లాకు చెందిన మండల స్పెషలాఫీసర్లు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శం

మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న మైనార్టీ నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల షాదీ తోఫా, కల్యాణమస్తు పథకాల ద్వారా 4,536 మంది దంపతులకు రూ.38.18 లక్షలు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పలు ముస్లిం సంఘాల ప్రతినిధులు ఆసిఫ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ దేశంలో ముస్లిం మైనార్టీలకు అండగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలందరూ తోడుగా ఉండాల్సిన అవసరముందన్నారు. కరోనా వంటి సంక్షోభ పరిస్థితులను సైతం ఎదుర్కొని సంక్షేమాన్ని ఏమాత్రం విస్మరించకుండా ముందుకు సాగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సుభానీ, సలీమ్, సుభానీ, నజీర్, ఫయాజ్, షాహిద్, కిషోర్ పాల్గొన్నారు.

సీఎన్జీ ఆటోల అనుమతికి దరఖాస్తు చేసుకోండి

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ నగరంలో పెండింగ్‌లో ఉన్న 529 డీజిల్ ఆటోలకు సీఎన్జీ ఆటోలుగా మార్చుకునేందుకు వాటి యజమానులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 నాటికి నగరంలో రిజిస్ట్రేషన్ అయిన 8,600 డిజిల్ ఆటోలను నియంత్రిస్తూ అప్పటి ప్రభుత్వం 155 జీఓను జారీ చేసిందని గుర్తు చేశారు. నియంత్రించిన ఆటోల స్థానంలో సీఎన్జీ ఆటోలకు వెంటనే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. దీంతో నగరంలోని 8,071 ఆటోలు సీఎన్జీ ఆటోలుగా మారినట్లు పేర్కొన్నారు. ఇంకా సీఎన్జీ ఆటోలకు అనుమతి తీసుకోవాల్సిన 529 మంది వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 529 ఆటోల జాబితాను బందరు రోడ్డులోని కార్యాలయం వద్ద నోటీసు బోర్డులో పొందుపరచినట్లు పేర్కొన్నారు.

భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగాలి



కౌంటర్లలో రికార్డులను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులతో సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలని, చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్, సెల్‌ఫోన్ పాయింట్లలో అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద దేవస్థానం నిర్వహిస్తున్న చెప్పుల స్టాండ్, క్లోక్ రూమ్, సెల్‌ఫోన్ పాయింట్లను బుధవారం ఆయన పరిశీలించారు. కౌంటర్లలో సిబ్బంది భక్తులకు జారీ చేస్తున్న కూపన్లను పరిశీలించడంతో పాటు వారం రోజులలో ఎంత మంది సేవలు వినియోగించుకున్నారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భక్తులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, వారికి ఎటువంటి సమాచారం కావాలన్నా ఓర్పుతో చెప్పాలని సూచించారు. భక్తుల నుంచి ఫిర్యాదులు లేకుండా సమన్వయంతో నడుచుకోవాలని సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎస్వీబీసీ అడ్వైజర్

ఎస్వీబీసీ చానల్ అడ్వైజర్ ఏఎస్ దుర్గారావు బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం చైర్మన్ కర్నాటి రాంబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా దిగువ పేర్కొన్న ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుదాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు హైవే రోడ్‌లోని వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్ నుంచి స్వాతి థియేటర్ వరకు, అలాగే ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి వీధి, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, అవుట్ ఏజన్సీ ఏరియా, మీరా సాహెబ్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

విశ్వనాథ్ సేవలు వెలకట్టలేనివి



విశ్వనాథ్ సంస్మరణ సభలో పాల్గొన్న రమాసత్యనారాయణ, విజయలక్ష్మి, బలరామకృష్ణ

విజయవాడ కల్చరల్: దర్శకుడు విశ్వనాథ్ సినీ రంగ సేవలు వెలకట్టలేనివని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద బుధవారం దర్శకుడు విశ్వనాథ్, గాయని వాణి జయరాం సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ తెలుగు సిని చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయే చిత్రాలకు దర్శకత్వం వహించారన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ హోదా తీసుకొచ్చిన మధుర గాయని వాణీ జయరాం అని అభివర్ణించారు. పారిశ్రామకవేత్త కోగంటి సత్యం, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి విశ్వనాథ్ సినీ రంగ సేవలను వివరించారు. తొలుత అతిథులు విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు.వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు బాలాజీకుమార్, బీవీ వరభద్రరావు పాల్గొన్నారు. దొరుకునా ఇటువంటి సేవ పేరుతో నగరానికి చెందిన గాయనీ గాయకులు విష్ణుప్రియ, కొప్పరపు ఉమాబలరాం, వడ్డాది కామేశ్వరి విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాలలోని గీతాలను ఆలపించారు.

మహిళ మెడలో చైను తెంపుకుపోయిన యువకుడు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఓ మహిళ మెడలో బంగారపు చైన్‌ను చోరీ చేసి పరారైన యువకుడిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కొత్తూరు తాడేపల్లి వేమవరానికి చెందిన చాదరాసిపల్లి వీరకుమారి, దుర్గారావు భార్యభర్తలు. వీరు కుండలు తయారు చేసి విక్రయిస్తుంటారు. బుధవారం ఉదయం వీరకుమారి కుండల వద్ద ఉండగా, ఓ యువకుడు బైక్‌పై వచ్చి పొగాకు పీల్చే గొట్టాం కావాలని అడిగారు. అది ఇచ్చే క్రమంలో మహిళ మెడలోని మూడున్నర కాసుల బంగారపు చైన్ తెంపేశాడు. దీంతో షాక్‌కు గురైన వీరకుమారి గట్టిగా కేకలు వేస్తూ ఆ యువకుడిని పట్టుకుంది. దీంతో చుట్టు పక్కల వారు రావడంతో ఆ యువకుడు బైక్‌ను అక్కడే వదిలేసి, చైన్ తీసుకుని రోడ్డు అవతలి వైపు ఉన్న మామిడి తోటలోకి పారిపోయాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మనువాదస్మృతి ప్రతుల దగ్ధం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనువాద మతోన్మాదుల కుట్రలను వ్యతిరేకిస్తూ దళిత గిరిజన ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షతన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. మనుస్మృతి ప్రతులను దగ్ధం చేసి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నటరాజు, నాయకులు శ్రీనివాసరావు, మోజస్, వరప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి భాగ్యారావు, జిల్లా కార్యదర్శి రాము పాల్గొన్నారు.

విజయవాడలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్

ప్రారంభించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వైద్యశాఖ మంత్రి విడదల రజని, పక్కన ఆస్పత్రి చైర్మన్ అమర్ అగర్వాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు):నేత్రవైద్యంలో అగ్రగామిగా ఉన్న డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ విజయవాడలోనూ అందుబాటులోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మహాత్మాగాంధీరోడ్డు రాఘవయ్యపార్కు ఎదురుగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రవైద్యంలో డాక్టర్ అగర్వాల్స్ హాస్పిటల్‌కు ఒక ప్రాముఖ్యత ఉందన్నారు. అలాంటి హాస్పిటల్ విజయవాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రిల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు ప్రైవేటు రంగంలో కూడా నాణ్యమైన సేవలు అందించడం స్వాగతించే విషయమన్నారు. డాక్టర్ అగర్వాల్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో రూ.500 కోట్లు వెచ్చించి 30 ఆస్పత్రులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రస్తుతం ఇండియాతో పాటు, ఆఫ్రికా ఇతర దేశాల్లో 137 ఆస్పత్రులు ఉన్నాయని పేర్కొన్నారు. 2023 చివరి నాటికి 200ల ఆస్పత్రులకు విస్తరించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఆరోగ్య రంగంలో వేగవంతమైన పురోగతి సాధిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగం కావాలని తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ కంద్రుకల్యాణ శ్రీనివాస చక్ర వర్తి, డాక్టర్ రమ్య, డాక్టర్ మేఘన పాల్గొన్నారు.

డైరెక్టర్లుగా కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే వెలంపల్లిని సత్కరించిన డైరెక్టర్లు



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న శ్రీదేవిశ్రీనివాస్, రమణారావు


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు సంబంధించిన డైరెక్టర్ల పదవీ కాలం పొడిగించినందుకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకటరమణరావు, రాష్ట్ర నగరాలు సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి శ్రీదేవి శ్రీనివాస్ వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. బీసీల సంక్షేమానికి జరుగుతున్న కార్యక్రమాలకు డైరెక్టర్లు తోడుగా ఉండాలని సూచించారు. దేరంగుల రమణారావు, శ్రీదేవిశ్రీనివాస్ మాట్లాడుతూ తమను డైరెక్టర్లుగా కొనసాగిస్తున్నందకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు, పాత శివాలయం మాజీ ధర్మకర్తలు సాధు సత్యనారాయణ, నన్నం దుర్గా, నాయకులు బాజీ, సోమిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు నిర్దిష్ట ప్రణాళిక అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శారదాదేవి

విజయవాడ స్పోర్ట్స్: ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్న యువతే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తుందని యువజన సర్వీసుల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదాదేవి అన్నారు. 9,10 తరగతుల విద్యార్థులు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కేరీర్ గైడెన్స్‌పై పటమటలోని యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. జీవితంలో అధిగమించాల్సిన లక్ష్యాలను ముందుస్తుగానే నిర్ణయించుకోవాలన్నారు. ఆ లక్ష్యాలను చేరుకునేందుకు పాఠశాల స్థాయి నుంచే పునాదులు వేసుకోవాలన్నారు. లక్ష్యాలు చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు మానసికంగా ధైర్యంగా ఉండాలని సూచించారు. యువతకు కేరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులను త్వరలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. అనంతరం మానసిక వైద్యులు డాక్టర్ జగదీష్, తేజావతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీ రామకృష్ణ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల యువజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



• పత్రాలు కాదు.. వలస పక్షులు

నగరంలో స్టేట్ గెస్ట్‌హౌస్ సమీపంలో ఓ చెట్టుపై వలస పక్షులు (రోజీ స్టార్లింగ్స్) అధిక సంఖ్యలో వాలి పత్రాలు లాగా కనిపిస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి స్వరాజ్య మైదానం, అతిథి గృహం తదితర ప్రాంతాల్లో పక్షులు విహరిస్తూ ఉంటాయి. పక్షుల ప్రేమికులు అక్కడకు వచ్చి వాటిని చూసి ఆనందంగా గడుపుతున్నారు.

–సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ



కె.విజయ పోరాటాలు ఆదర్శనీయం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ నాయకురాలు కె.విజయ చేసిన పోరాటాలు అందరికి ఆదర్శనీయమని ఆ పార్టీ నాయకులు కె.రామరాజు పేర్కొన్నారు. మహిళా సమాఖ్య నాయకురాలు విజయ వర్ధంతి కార్యక్రమం వాంబేకాలనీలోని స్కూల్ సెంటర్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో జరిగిన అనేక పోరాటాల్లో విజయ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని, ప్రధానంగా కండ్రిక భూపోరాటాల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. తొలుత విజయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు మెడికల్ కిట్లు, దుస్తులు పంపిణీ చేశారు. రైల్వే ప్రసాద్, పాపారావు పాల్గొన్నారు.

• ఘన నివాళులు

గొల్లపూడిలోని ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం నివాసం వద్ద ఆయన సతీమణి స్వర్ణకుమారి సంస్మరణ దిన కార్యక్రమం బుధవారం జరిగింది. స్వర్ణకుమారి చిత్రపటానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ కాంతి రానా టాటా ఘనంగా నివాళులర్పించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



